క్లుప్తంగా

క్రీస్తును ఆరాధించాలి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



దాచేపల్లి : ప్రభువైన ఏసుక్రీస్తును ఆరాధించటమే నిజమైన క్రిస్మస్ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. మండల వ్యాప్తంగా క్రిస్మస్ పండుగ వేడుకలు సోమవారం జరిగాయి. మండలంలోని శ్రీనగర్ గ్రామంలోని చర్చిలో జరిగిన క్రిస్మస్ పండుగ ఆరాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతికి నిదర్శనంగా క్రీస్తు ఈ లోకంలో జన్మించారని, క్రీస్తు బోధనలు పాటించి సన్మార్గంలో పయనించాలని చెప్పారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయం, ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో క్రిస్మస్ పండుగ ఆరాధనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్యక్రమాల్లో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీ కందుల జాను, సర్పంచ్‌లు కూసం నాగిరెడ్డి, జంగా సురేష్, వినుకొండ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు, జోనల్ ఇన్‌చార్జి మాశెట్టి బుజ్జి, పాస్టర్లు జీఎస్ ప్రసన్నకుమార్, కాటుపల్లి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

పట్టణ అధికార ప్రతినిధిగా బుజ్జి నియామకం



దాచేపల్లి : వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధిగా నగర పంచాయతీకి చెందిన కొమ్ము బుజ్జి నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బుజ్జికి సోమవారం నియామక పత్రం అందజేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా పనిచేయాలని, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. బుజ్జి నియామకం పట్ల నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, యువజన విభాగం జిల్లా కార్యదర్శి మునగా శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు అభినందనలు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



దాచేపల్లి : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన పొందుగల రైల్వేస్టేషన్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. సుమారు 50 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాలు తెలిసిన వారు నడికుడి జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ సునీల్ చెప్పారు.



మాచర్లలోని లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం



పాపిరెడ్డికుంట తండాలో షాలేం ప్రార్థనా మందిరంలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ శామ్యూల్ నాయక్



పాస్టర్లకు దుస్తులు అందజేస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ అంజిబాబు



రెంటచింతల కానుకమాత చర్చిలో సమిష్టి దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్లు



తెలుగుబాప్టిస్టు చర్చిలో వాక్యాన్ని చెబుతున్న పాస్టర్

పాపులను రక్షించుటకు క్రీస్తు జననం

- వాడవాడలా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

రెంటచింతల: తరతరాలుగా మానవాళిని వెంటాడుతున్న పాపముల నుంచి రక్షించుటకు యెహోవా దేవుడు ఎన్నుకున్న ఏకైక సాధనం క్రీస్తు జననమని రాజుపాలెం విచారణ గురువులు రె.ఫాదర్ పోతిరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి స్థానిక కానుకమాత చర్చి ఆవరణలో విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్ధుమర్రెడ్డి నేతృత్వంలో ఫాదర్ సలిబండ్ల సందీప్‌రెడ్డి, డీకన్ బ్రదర్లతో కలిసి నిర్వహించిన పవిత్ర సమిష్టి దివ్యపూజాబలిలో భక్తులను ఉద్దేశించి ఇన్నారెడ్డి మాట్లాడారు. భూలోకంలోని పాపులను రక్షించటకై లోకరక్షకుడైన చిన్నారి బాలయేసు కన్య మరియమ్మకు బెత్లెహేమ్ పట్టణంలోని ఓ పశువులపాకలో జన్మించారన్నారు. మన హృదయంలో ఏసుక్రీస్తును ప్రతిష్టించి ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అని.. పాపముల నుంచి మానవాళిని రక్షించుటకై ఏసుక్రీస్తు శిలువమరణం పొందారన్నారు. ఈ దివ్యపూజాబలిలో మఠకన్యలు, చర్చిపెద్దలు, భక్తులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం కానుకమాత చర్చిలో ఫాదర్ కొణతం ఏలీషారాజు, ఇవాంజికల్ లూథరన్ చర్చిలో రె.పాస్టర్ కటికల ఏసుదానం, గోలి, మిట్టగుడిపాడు గ్రామాలలో ఫాదర్లు పోతిరెడ్డి ఇన్నారెడ్డి, ఏరువ లూర్ధుమర్రెడ్డి యెహోవా దేవుని కుమారునిగా జన్మించిన బాలయేసు జన్మవృత్తాంతాన్ని అద్భుతాలను, క్రిస్మస్ ప్రత్యేకతను వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామ వీధులలో ఊరేగింపు..

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ పురవీధులలో బాలయేసు ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించిన తేరును పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఊరేగించారు. కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్ధుమర్రెడ్డి ఆధ్వర్యంలో మఠకన్యలు, చర్చి పెద్దలు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలోని ఆరోగ్యనాధుని, లూర్ధుమాత, ఫాతిమామందిరం తదితర మందిరాలు సందర్శిస్తూ, మరియదళ సభ్యులు భక్తిగీతాలను ఆలపిస్తూ తేరు ప్రదర్శనను భారీగా బాణసంచా కాలుస్తూ నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ప్రేమ కరుణతో జీవించాలి..

గురజాల : ప్రతి ఒక్కరూ ప్రేమ కరుణతో జీవించాలని దైవ సేవకులు విశ్వాసకులకు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దైవ సేవకులు మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోక రక్షకుడని విశ్వాసానికి వెలుగై ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారన్నారు. స్థానిక క్రీస్తు లూథరన్ దేవాలయం తెలుగు బాప్టిస్టు చర్చి, ఎరుషలేము ప్రార్థన మందిరం, ది లోయల్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చి, కింగ్‌డం గాస్పల్ చర్చి, కృపామయుడు మందిరాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్రీస్తు దేవాలయాలను విద్యుత్ దీపాలతో, రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఎదుటి వారి పట్ల దయ, జాలి,ప్రేమ, కరుణ, క్షమా గుణములు కలిగి ఉండాలని పాస్టర్లు సందేశమిచ్చారు.

మాచర్లలో ఘనంగా ఏసుక్రీస్తు జన్మదినం

మాచర్ల: పట్టణంలోని ఆయా చర్చిల్లో ఘనంగా క్రిస్మస్ పండుగను నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని 70 చర్చిల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు క్రిస్మస్‌ను ప్రత్యేకంగా జరుపుకున్నారు. పట్టణంలోని లూథరన్ చర్చిలో పశ్చిమ సినడ్ బిషప్ చాట్ల అంజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ కాపరి రెవ.రవికుమార్, కౌన్సిలర్ మాచర్ల సుందరరావు, సొసైటీ కాలనీలో క్రిస్మస్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ది లెమెన్ ఇవాంజలికల్ చర్చి, ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ కొమ్మారెడ్డి రాయపరెడ్డి, 20వ వార్డులోని బేతేలు మందిరంలో జాన్ వెస్లి, 10వ వార్డులోని జేబీపీఎఫ్ చర్చి పాస్టర్ బ్రహ్మనాయుడు, మరనాత చర్చి, సాగర్ రోడ్డులో ని ది లెమెన్స్ చర్చి, పెంతెకోస్తు, 24వ వార్డులో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఆయా వార్డులలో వివిధ పాస్టర్ల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి క్రీస్తును కీర్తిస్తూ, ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

వెల్దుర్తిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వెల్దుర్తి: ప్రపంచ మానవాళికి శాంతి సందేశాన్ని అందించిన మహనీయుడు ఏసుక్రీస్తు అని షాలేం మందిరం పాస్టర్ శామ్యూల్ నాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని పాపిరెడ్డికుంట తండాలో జరిగిన క్రీస్తు జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి జరుపుకున్నారు. పాస్టర్ మాట్లాడుతూ క్రైస్తవులు శాంతి, దయ, కరుణ కలిగి ఉండి ఇతరుల పట్ల ప్రేమతో మెలగాలన్నారు. క్రీస్తు బోధనలను ఆచరించాలన్నారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మానాయక్, ఎంపీటీసీ రమావత్ బాలునాయక్, బాబునాయక్, అంజినాయక్, మంత్రునాయక్, క్రైస్తవులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిలలో పాస్టర్ల ఆధ్వర్యంలో క్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

పాస్టర్లకు దుస్తులు పంపిణీ..

మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలోని చర్చిల పాస్టర్లకు వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొజ్జా అంజిబాబు ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది చర్చి పాస్టర్లకు క్రిస్మస్ పండుగ సందర్భంగా నూతన దుస్తులను అందించటం సంతోషకరంగా ఉందన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, గ్రామ సర్పంచ్ సపారపు లచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ దుబ్బా సియోను, కుక్కమూడి అశోక్, మరియదాసు తదితరులున్నారు.

ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ వేడుకలు

కారెంపూడి: మండలంలో క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం క్రైస్తవులు అత్యంత ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా జరుపుకున్నారు. కారెంపూడిలో ఉదయం క్రీస్తు జననం పాటలతో విశ్వాసులు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చిలో క్యాండిల్ లైట్ సర్వీస్‌తో క్రీస్తును స్మరించారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో ప్రజలు పాల్గొన్నారు. పాస్టర్ డాక్టర్ వి.మాణిక్యా రావు క్రీస్తు సందేశమిచ్చారు. ఇదిలా ఉంటే కారెంపూడితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎక్కడికక్కడ చర్చిలకు తరలివెళ్లి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించారు. చిన్నారులు క్రీస్తు జననం నాటికలను ప్రదర్శించారు. అన్ని చర్చిలు క్రిస్మస్ పర్వదినాన విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోయాయి. క్రిస్మస్ స్టార్లు వాడవాడలా కనువిందు చేశాయి.

పిడుగురాళ్లలో క్రిస్మస్ వేడుకలు

పిడుగురాళ్ల: పట్టణంలోని తెలుగు బాప్టిస్టు చర్చి, లూథరన్ చర్చి, హోసన్న మందిరం, ఆర్‌సీఎం చర్చి, యువలాంజికల్ ఫెలోషిప్ చర్చిల నందు క్రైస్తవులు ఆదివారం రాత్రి నుంచి ప్రార్థనలు నిర్వహించి దేవుని కృపను పొందారు. ఆయా చర్చిల పాస్టర్‌లు ప్రార్థనలు నిర్వహించి దేవుని సందేశాన్ని వినిపించారు.

దుర్గిలో క్రిస్మస్ వేడుకలు

దుర్గి: మండల పరిధిలోని పలు గ్రామాలలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం, దుర్గిలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామాలలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముటుకూరులో సాయంత్రం మరియమ్మ తల్లి బాలయేసును టపాసులు కాల్చుతూ బ్యాండ్ మేళంతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక సంఘ కాపరి పి.ఏసురత్నం, క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. కంచరగుంట ఎస్సీ కాలనీలోని జీసస్ మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ బొంత కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ యువ నాయకులు మాదాసు వాసు చేతుల మీదుగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ముటుకూరు లూథరన్ చర్చిలో నిర్వహించిన కార్యక్రమానికి డెలిగేటు మాచర్ల పెద్ద అచ్చయ్య, సంఘ పెద్దలు పులిమెల వెంకయ్య, అన్నారావు, మాణిక్యం ప్రసాద్, మాచర్ల మైఖేల్, మరియదాసు, కుక్కమూడి చిన్నయ్య, ప్రసాదు పాల్గొన్నారు.



కారెంపూడి చర్చిలో క్రిస్మస్ ప్రార్థనల్లో భక్తులు

సాగర్‌మాత ఆలయంలో క్రిస్మస్ వేడుకలు

విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురి సౌత్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగర్‌మాత దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. అనంతరం దివ్యబలిపూజ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పశువులపాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విచారణ గురువులు జోసఫ్ మాట్లాడుతూ యేసుక్రీస్తు జీవితం అందరికి ఆదర్శనీయమన్నారు. ప్రభువైన యేసుక్రీస్తు మానవుడిగా మన మధ్య జన్మించిన రోజే క్రిస్మస్ పర్వదినమని అన్నారు. క్రీస్తు సందేశాలను సమస్త మానవాళి ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జోసఫ్ తంబి, భక్తులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్

క్రీస్తు పుట్టుక సర్వసృష్టికి పర్వదినం



క్రీస్తు జన్మదిన సందేశాన్ని వివరిస్తున్న పాస్టర్ గురుప్రసాదరావు

మాచవరం: క్రీస్తు పుట్టుక సర్వసృష్టికి పర్వదినం అని పాస్టర్లు వి.గురుప్రసాదరావు, ఎం.జీవితప్రకాష్, డేవిడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు క్రీస్తు సందేశాన్ని ఉపదేశిస్తూ క్రీస్తు జననంతో మానవుని మనుగడకు గుర్తింపు లభించిందని, ఆయన పుట్టుకతో క్రీస్తుశకంగా, క్రీస్తుపూర్వంగా చరిత్రలో లిఖితమైందని అన్నారు. ఏసుక్రీస్తు జనన సందేశాన్ని వివరించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో కేకులు కోసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవ సోదరులు స్తుతి గీతాలు ఆలపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



విద్యుత్ కాంతులతో ముటుకూరు లూథరన్ చర్చి



దివ్యబాలయేసు ప్రతిమతో గ్రామ పురవీధులలో తేరు ప్రదర్శన

పట్టణ, మండల యూత్ అధ్యక్షుల ఎంపిక



మందా సుధీర్



బొలినేడి నాగరాజు



మద్దు ప్రసాద్



అనిల్‌కుమార్



నరసింహారెడ్డి



జక్కా సత్యం



రాజశేఖర్‌రెడ్డి



రామాంజి



బుచ్చిబాబు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల యూత్ అధ్యక్షులుగా ఏడుగురు రాష్ట్ర కార్యాలయం నుంచి ఎంపికైనట్లు పిడుగురాళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆదివారం తెలియజేశారు. పిడుగురాళ్ల పట్టణ యూత్ అధ్యక్షులుగా మందా సుధీర్, పిడుగురాళ్ల మండల యూత్ అధ్యక్షులుగా మండలంలోని పెద అగ్రహారం గ్రామానికి చెందిన బొలినేడి నాగరాజు, అలాగే మాచవరం మండలం యూత్ అధ్యక్షులుగా మండలంలోని మోర్జంపాడు గ్రామానికి చెందిన మద్దు ప్రసాద్ ఎంపికయ్యారు. అలాగే దాచేపల్లి పట్టణ యూత్ అధ్యక్షులుగా నాదెండ్ల అనిల్‌కుమార్, అలాగే దాచేపల్లి మండల యూత్ అధ్యక్షులుగా దాచేపల్లి మండలంలోని తంగెడ గ్రామానికి చెందిన కాసర్ల నరసింహారెడ్డి, గురజాల పట్టణ యూత్ అధ్యక్షులుగా జక్కా సత్యం, మండల యూత్ అధ్యక్షులుగా మండలంలోని పాత అంబాపురం గ్రామానికి చెందిన దుగ్గిరాల రాజశేఖర్‌రెడ్డిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ఏడుగురు పట్టణ, మండల యూత్ అధ్యక్షులుగా ఎంపికకు కృషి చేసిన గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు పట్టణ, మండల యూత్ అధ్యక్షులందరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని వారికి సూచించారు.

మండల యువజన విభాగం అధ్యక్షుడిగా రామాంజి

వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ళ గ్రామానికి చెందిన కాయకోకుల రామాంజనేయులును వెల్దుర్తి మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు మండల కన్వీనర్ కోట్ల పాపిరెడ్డి సోమవారం తెలిపారు. ఎంపికైన రామాంజి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్‌సీపీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలన్నారు. రామాంజి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి మండల పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టినందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జూలకంటి వీరారెడ్డి, కాయకోకుల మార్కొండయ్య, పంగా చిన కాశయ్య, నాయకులు మోర బోయిన శ్రీను, బూడిద వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మండల వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడిగా బుచ్చిబాబు

దుర్గి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం దుర్గి మండల వైఎస్సార్‌సీపీ యువజన అధ్యక్షుడిగా యకటీల బుచ్చిబాబును నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. సోమవారం నియామక పత్రాలను అందుకున్న బుచ్చిబాబు మాట్లాడుతూ తనపై నమ్మకముంచి నాల్గవ సారి అధ్యక్షుడిగా నియమించడానికి సహకరించిన పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన వింగ్ ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికలలో పీఆర్కే ఐదవ సారి గెలుపుకు, పార్టీ కోసం కష్టపడతానన్నారు.

బీసీ సంక్షేమ సంఘం గురజాల యువజన ఉపాధ్యక్షుడిగా మస్తాన్

పిడుగురాళ్ల: బీసీ సంక్షేమ సంఘం గురజాల నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షుడిగా జిమ్ మస్తాన్ నియమితులయ్యారు. పిడుగురాళ్ల పట్టణంలోని షాదీఖానాలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు యామ మురళి, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగుల శ్రీనివాసరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ బీసీల అభివృద్ధి కొరకు పాటుపడతానని తెలియజేశారు.

సత్కారం, అభినందన

మాచర్ల: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన సంఘ నాయకులు రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకత్వం షేక్ మస్తాన్, మాచర్ల పవన్ కుమార్‌లకు పదవులు కేటాయించటంతో వారు సోమవారం రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు యువజన సంఘ నాయకులుగా కృషి చేయాలని కోరారు. నూతనంగా ఎంపికైన పట్టణంలోని తూర్పు బావి ప్రాంత నివాసి మైనార్టీ నేత షేక్ మస్తాన్, 20వ వార్డు మాచర్ల పవన్ కుమార్‌ను పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన వారిని సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొని అభినందించారు.



పల్నాడు జిల్లా అధ్యక్షులు మురళి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న మస్తాన్



జిల్లా సంయుక్త కార్యదర్శి పవన్‌కుమార్‌తో రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పీవీఆర్

నేడు అమ్మవారి తిరునాళ్ల

గురజాల : పట్టణంలో వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల మంగళవారం నిర్వహించడం జరుగుతుంది. తిరునాళ్ల మొదటి రోజు కొలత చేపట్టిన బియ్యం సోమవారం రాత్రి విడుపు తీసి కొలవగా బియ్యం రెట్టింపు అవుతాయని భక్తుల నమ్మకం. నేడు తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి దేవాలయం విద్యుత్ వెలుగులతో తీర్చిదిద్దారు. మంగళవారం సాయంత్రం శిడిమాను ఉత్సవం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటుంది.

నేడు ఆడుదాం ఆంధ్రా ప్రారంభం

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో నేడు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో యు.వరప్రసాద్ సోమవారం తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 371 టీంలు పేర్లు నమోదు చేసుకున్నాయన్నారు. వివరాలకు మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పీడీ నర్సిరెడ్డిని సంప్రదించాలని అన్నారు.

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం మంగళవారం ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరవుతారన్నారు. స్కాలర్స్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో క్రికెట్, బ్యాడ్మింటన్, మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు.

మాచర్లను ముంచెత్తిన మంచు



మాచర్ల: పట్టణంలో సోమవారం ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు మంచుతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రెండున్నర గంటలకుపైగా మంచు తీవ్రంగా ఏర్పడింది. దీంతో పాటు చలి వాతావరణం, మంచు ప్రభావం ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది.

పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేయండి

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పార్టీ అభివృద్ధికి పనిచేసిన వారికి పదవులు వాటంతట అవే వస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు అన్నారు. సోమవారం మాచర్ల క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా ఎంపికైన దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి పీఆర్కేకి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కష్టపడి పనిచేసే వారిని అన్ని విధాలా ఆదుకుంటామని, పార్టీకి సైనికుల్లాగా పనిచేస్తే ముందుముందు రోజుల్లో ఇంకా ఉన్నత పదవులు వస్తాయన్నారు. పార్టీలో పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. నూతనంగా పదవి పొందిన శ్రీనివాసరెడ్డికి మిఠాయి తినిపించి అభినందనలు తెలిపారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మాజీ జెడ్పీటీసీలు నవులూరి భాస్కర్‌రెడ్డి, శేరెడ్డి గోపిరెడ్డి, ఎంపీటీసీ ఈగల అయ్యన్న, పాలపల్లి సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, గాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయ కులు ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, గురవారెడ్డి అభినందించారు.



ప్రభుత్వ విప్ పీఆర్కేకి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాసరెడ్డి

వాలీబాల్ విజేతలకు బహుమతులు పంపిణీ

దుర్గి: క్రిస్మస్ సందర్భంగా కంచరగుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాదాసు వాసు ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొత్తం నాలుగు జట్లు పోటీలో పాల్గొనగా విన్నర్‌గా నిలిచిన రవిరాజు జట్టుకు వైఎస్సార్‌సీపీ నాయకులు మాదాసు వాసు షీల్డ్‌తో పాటు రూ.2,000 నగదును అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కోట శంకర్ జట్టుకు, ఎంపీటీసీ బొంత కృష్ణ షీల్డ్‌తో పాటు రూ.వెయ్యి నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీర్నిడి చంద్రయ్య, బీర్నిడి బంగారయ్య, సచివాలయం కన్వీనర్ బీర్నిడి దానయ్య, పృథ్వి, గ్రామస్తులు పాల్గొన్నారు.